మైనార్టీల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే గోపాల్



ఉమ్రాకు వెళ్తున్న నజీర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ అంకితభావంతో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటీ నాయకుడు నజీర్(అత్తుబాయ్) తన అనుచరులతో ముస్లింలు పవిత్రంగా భావించే ఉమ్రాకు బయలుదేరడంతో డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల సంక్షేమం, ఉమ్రా యాత్రకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం షరీఫ్, జునేద్ బాగ్దాదీ, నాయకులు ఉమాకాంత్, జబ్బార్, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఐక్యతకు ‘ఇఫ్తార్’ దోహదం

ముషీరాబాద్: రంజాన్ పవిత్ర మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తున్నాయని బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ ఆషీర్‌ఖానా కమిటీ ప్రధాన కార్యదర్శి జాఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో ఇఫ్తార్‌విందు నిర్వహించారు. ఈ ఇఫ్తార్ విందుకు టి.పద్మారావుగౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ముఠా గోపాల్ మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ఐక్యంగా ఇఫ్తార్ విందులను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.



ఇఫ్తార్ విందును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు పద్మారావు, ముఠా గోపాల్

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, శ్రీధర్ చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, అజయ్‌ముదిరాజ్, ముషీరాబాద్ ఆషీర్‌ఖానా కమిటి నాయకులు వాహిద్ ఆలీ, అలందార్ అబ్బాస్, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో కిషన్‌రెడ్డి పర్యటన



బస్తీవాసులతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

నల్లకుంట: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలోనూ అభివృద్ధిపథాన సాగుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని చైతన్యనగర్, ఇందిరానగర్, గోల్నాక వెజిటేబుల్ మార్కెట్, వెంకటేశ్వరనగర్ బస్తీలలో కిషన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బస్తీవాసులతో ముచ్చటించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీ 400లకుపైగా స్థానాల్లో గెలుపొందుతుందని, మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు, నల్లకుంట కార్పొరేటర్ అమృత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

‘అంబర్‌పేట బిడ్డను ఆశీర్వదించండి’



నాగరాజును శాలువాతో సన్మానిస్తున్న కిషన్ రెడ్డి

నల్లకుంట: ‘నేను మీ అంబర్‌పేట బిడ్డను. మరోసారి నన్ను ఆశీర్వదించాలి’ అని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నల్లకుంట డివిజన్ వెంకటేశ్వర నగర్‌లో పర్యటించిన మంత్రి స్థానికంగా నివాసముండే సీనియర్ సిటీజన్ వీరమల్ల నాగరాజు కుటుంబంతో కలిసి ముచ్చటించారు. అంతకుముందు ఆ కుటుంబ సభ్యులు కేంద్రమంత్రి హారతి పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాగరాజును శాలువాతో సన్మానించిన కేంద్రమంత్రి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, స్థానిక కార్పొరేటర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కార్యక్రమంలో పాల్గొన్న సత్యవతి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని భూమిక ఎడిటర్ కొండవీటి సత్యవతి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో యువతీయువకుల నాయకత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ సినిమాలు, క్రికెట్‌కే పరిమితం కాకుండా సమాజహితం కోసం యువత పని చేయాలని కోరారు. సామాజిక సమస్యలపై దృష్టి సారించి ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలను కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భూమిక ఉమెన్స్ కలెక్టివ్ డైరెక్టర్ ప్రశాంతి, సంస్థల ప్రతినిధులు రుక్మిణీరావు, నందినీరావు, హెచ్‌ఆర్‌ఎఫ్ కన్వీనర్ జీవన్‌కుమార్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, ఆశాలత, మీరా, సంఘమిత్ర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల ఫిట్‌మెంట్‌పై నివేదిస్తా

పీఆర్‌సీ చైర్మన్ ఎన్.శివశంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వినికిడి లోపంతో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని పీఆర్‌ఎస్ చైర్మన్ ఎన్.శివశంకర్ తెలిపారు. వైకల్యంతో ఉన్నవారికి రోస్టర్ పాయింట్స్ 100 నుంచి 200, 201 నుంచి 400 వరకు ప్రమోషన్‌లో ఉన్న రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ డెఫ్ అండ్ డెమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శివానందం, ఎం.శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పీఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. పీఆర్‌సీ చైర్మన్‌ను కలిసినవారిలో డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, జాతీయ కోకన్వీనర్ వి.భారతి, కె.వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.



పీఆర్‌సీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

రోడ్డు అధ్వానం.. ప్రజలకు అవస్థలు



అంబర్‌పేట గాంధీవిగ్రహం చౌరస్తా వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

అంబర్‌పేట: అధ్వానంగా రోడ్డుపైనుంచి వెళ్లాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాల్లో రాకపోకలు సాగించడానికి నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డుపై నిర్మాణం సాగుతుండటంతో వాహనదారులు తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఫ్లైఓవర్ కింద రోడ్ అధ్వానంగా ఉండటంతో నిత్యం ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నిర్మాణ సంస్థ కనీస ఏర్పాట్లు చేయకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోల్నాక, చే నంబర్, శ్రీరమణ చౌరస్తా, గాంధీ విగ్రహం చౌరస్తా, ముఖరం హోటల్ ప్రాంతాల మీదుగా సాగే ఫ్లైఓవర్ ప్రాంతాల్లో రోడ్డు దారుణంగా ఉంది. ఇప్పటికైనా ఫ్లైఓవర్ కింద రోడ్ తాత్కాలిక మరమ్మతులు చేసి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



హుండీ ఆదాయం లెక్కింపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కింపు గురువారం జరిగింది. మూడు నెలలకుగాను ఆలయానికి రూ.21లక్షల 67 వేల 751 ఆదాయం లభించింది. ఆలయం వ్యవస్థాయ వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. దేవాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

ఏప్రిల్ 21న ‘ది గిగెల్ ఫెస్ట్’

బంజారాహిల్స్: ఏప్రిల్ 21వ తేదీన దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ‘ది గిగెల్ ఫెస్ట్’ ఫ్లీ మార్కెట్‌కు నగరం వేదిక కాబోతున్నది. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని టెర్రా కేఫ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ తారలు ప్రియాంక చౌదరి, ప్రతీకా రాయ్, ఊర్మిలా చౌహాన్‌తో పాటు పలువురు మోడల్స్ పాల్గొని ఫ్లీ మార్కెట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికగా జరగబోయే ఈ ఫ్లీ మార్కెట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విభిన్న రకాల వస్తువులు, చేతి వృత్తుల ఉత్పత్తులతో పాటు పలు రకాల గేమింగ్ యాక్టివిటీలను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడికి వచ్చే వారిని ఎంటర్‌టైన్‌మెంట్ చేసేందుకు ప్రత్యేకంగా మ్యూజిక్ షో కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు పద్మ కాలనీలో ఉచిత వైద్యశిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతావాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన ఉదయం 8 నుంచి 12 గంటల వరకు యశోద ఆసుపత్రి వైద్య నిపుణుల సహకారంతో పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై మురళీధరుడు, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి జైహింద్ తెలిపారు.ఈ శిబిరంలో గుండెకు సంబంధించిన పరీక్షలతోపాటు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

వాల్మీకి బోయలకు సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'



మీనగ గోపి బోయ

కాచిగూడ: వాల్మీకి బోయలకు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మీనగ గోపి బోయ అన్నారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని, ఎమ్మెల్సీ పదవి ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం ఇచ్చిన హామీలపై ఈ నెల 29న శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మేథోమధన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఓటేసిన ఎమ్మెల్యే కాలేరు



బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఓటేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో న్యాయవాది, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో నూతన కార్యవర్గం కోసం జరిగిన ఎన్నికల్లో పాల్గొని ఓటేశారు.

ఉమెన్ వరల్డ్ రికార్డ్స్‌లో శ్రీజకు స్థానం



చిక్కడపల్లి: సినీ, టీవీ, నాటక రంగాలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీజ సాదినేని ఉమెన్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. ఈ మేరకు ఆమె గురువారం సాయంత్రం వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ తాను 33 తెలుగు నాటకాలకు దర్శకత్వం వహించిన తొలి తెలుగు దర్శకురాలిగా రికార్డు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కష్టపడే తత్వాన్ని అలవరచుకుంటూ మనకు మనమే అవకాశాలు సృష్టించుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. అందుకు తగిన ఫలితాలు వస్తాయన్నారు. అవార్డు లభించిన సందర్భంగా సినీ టీవీ, నాటక రంగాల కళాకారులను శ్రీజకు అభినందనలు తెలిపారు.

లక్ష్మీగణపతి ఆలయంలో సంకటహర చతుర్థి



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి శత కలశాభిషేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి, అర్చకులు, భక్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలులో రాష్ట్ర సర్కారు విఫలం

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం డివిజన్‌లోని చిక్కడపల్లి, బాపునగర్ ప్రాంతాలలో కేంద ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆయన కలసి మాట్లాడారు. మోదీ గ్యారంటీలు, సంక్షేమ పథకాలపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వినయ్ కుమార్, రత్నసాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, కల్యాణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.



కరపత్రాలతో వివరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్, వినయ్‌కుమార్, సాయిచంద్

పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని డీజీపీకి వినతి

కాచిగూడ: పోలీసుల నుంచి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఓ వ్యక్తి గురువారం రాష్ట్ర డీజీపీని ఆశ్రయించారు. ఈ సందర్భంగా తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సూదమళ్ల వెంకటస్వామితో కలిసి నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమ్మరి కాలప్ప మాట్లాడుతూ తన తండ్రి, సోదరుడి భార్య కలిసి తనపై అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. పోలీసులు రౌడీషీట్ తెరిచి బైండోవర్ పేరుతో గంటల తరబడి పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టును ఆశ్రయించగా రౌడీషీట్‌ను కొట్టివేసిందని చెప్పారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో తమ ఇంటి వద్ద రెక్కీ నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులతోపాటు స్థానిక పోలీసుల నుంచి తనకు రక్షణ కల్పించాలని డీజీపీకి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.



వెంకటస్వామితో కలిసి మాట్లాడుతున్న బాధితుడు కాలప్ప

గ్రేటర్ కాంగ్రెస్ మైనార్టీ కమిటీ కోఆర్డినేటర్‌గా శ్రావణ్‌కుమార్

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గండి శ్రావణ్ కుమార్ గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ మైనార్టీ కమిటీ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. గురువారం ఆయనకు కమిటీ చైర్మన్ హర్షద్ షేక్ నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మైనార్టీలు కాంగ్రెస్‌కు మరింత దగ్గరయ్యేలా తన వంతు కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన హర్షద్, ఏఐసీసీ జాతీయ మైనార్టీ కమిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గాడీ, వైస్ చైర్మన్ అనిల్ థామస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



శ్రావణ్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందజేసిన హర్షద్ షేక్

ఆ జీవోలను విడుదల చేయాలి

చిక్కడపల్లి: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచే జీవోలను విడుదల చేయాలని కోరుతూ గురువారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికసంఘం నేతలు కార్మికశాఖ రాష్ట్ర జాయింట్ కమిషనర్ చంద్రశేఖరంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి వి.మధు మాట్లాడుతూ జీవో 94ను రద్దు చేసి 22ను గెజిట్ చేయాలని కోరినట్లు వివరించారు. 94 జీవో రద్దుకోసం 1700 మంది కార్మికుల వ్యక్తిగత అభ్యంతరాల దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. గత ఏడాదిన్నర కాలంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు జీవో 21, 22లను గెజిట్ చేసి జీతాలను పెంచాలని ఆందోళన, పోరాటాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీలం మధు, గద్దల శ్రీను, మహేందర్, అరవింద్, రాజన్న, వీరన్న, శ్రీను, రాజశేఖర్, రాజు, లక్ష్మి, సమ్మయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులకు వేతనాలు పెంచాలి

చిక్కడపల్లి: ప్రయివేట్ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.28 వేలుగా నిర్ణయించాలని కోరుతూ గురువారం తెలంగాణ ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్స్, అలైడ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాష్ట్ర అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కన్వీనర్ యాటల సోమన్న మాట్లాడుతూ సెక్యూరిటీ సర్వీసెస్‌లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ జీవో నంబర్ 81కు సవరణలను అదనపు కమిషనర్‌కు అందజేశామని తెలిపారు.

అధ్యయనమే లక్ష్యసాధనకు మార్గం



కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న రాజవోలు వెంకటరమణ, వినోద్ వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: న్యాయ విద్యలో అధ్యయనాలు చేయడం ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధించుకునేందుకు మార్గం సుగమం అవుతుందని ఐసీఎస్‌ఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఎస్ రాజవోలు వెంకటరమణ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే జి.వినోద్‌వెంకటస్వామి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కళాశాల, ఐసీఎస్‌ఐ హైదరాబాద్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీఎస్‌ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ లక్ష్మినారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబుయాదవ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాటర్‌వర్క్స్ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, కఠినచర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబుయాదవ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణలతో కలిసి మాట్లాడారు. వాటర్‌వర్క్స్ మాదన్నపేట్ సెక్షన్‌లో పని చేస్తున్న ఉద్యోగి సీహెచ్ రమేష్‌పై బుధవారం రెయిన్‌బజార్‌కు చెందిన ఓ వ్యక్తి దాడి చేశారని తెలిపారు. డ్రైనేజీలో నుంచి తీసిన మట్టిని తొలగించలేదని నెపంతో ఏ మాత్రం సంబంధం లేని రమేష్‌పై దాడి చేశారని అన్నారు. ఐఎన్‌టీయూసీ అనుబంధం సంఘం జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాత్రం నిందితుడిని తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

దారి తప్పి.. పెట్రోలింగ్ పోలీసులకు చిక్కి..



బాబును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

చిక్కడపల్లి: దారితప్పి వచ్చి చిక్కిన బాలుడిని చిక్కడపల్లి పోలీసులు చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన కథనం ప్రకారం... నాగమయ్యకుంట అమ్మవారి దేవాలయం వద్ద బుధవారంరాత్రి ఒంటి గంట సమయంలో ఓ బాలుడు(10) చిక్కడపల్లి పెట్రోలింగ్ పోలీసుల కంటపడ్డాడు. రోడ్డుపై తిరుగుతూ కనిపించడంతో పోలీసులు చేరదీశారు. అతని గురించిన వివరాలు వాకబు చేయగా చెప్పలేకపోయాడు. స్టేషన్‌కు తీసుకువచ్చి ప్రేమగా మాట్లాడుతూ ఆరా తీశారు. అతడు చెప్పిన వివరాల ప్రకారం వారాసిగూడకు చెందిన జైద్ అన్సారీగా పోలీసులు గుర్తించి తల్లిదండ్రులను వెతికి పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వారికి బాలుడిని అప్పజెప్పారు. తప్పిపోయిన కుమారుడిని తమకు అప్పగించడంతో ఆ బాలుడి తల్లదండ్రులు చిక్కడపల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

- భీమా మైదాన్ బస్తీలో పోలీసుల కార్డన్ సెర్చ్
- అనుమతులు లేని 10 ద్విచక్ర వాహనాల స్వాధీనం

చిక్కడపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ ప్రజలకు కోరారు. భీమా మైదాన్ బస్తీలో గురువారంరాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. భీమామైదాన్ బస్తీలో ఎవరెవరు నివాసం ఉంటున్నారు... అందరూ స్థానికులేనా లేక గుర్తుతెలియనివారు ఎవరైనా నివాసం ఉంటున్నారా... అనే కోణాల్లో విచారణ చేపట్టారు. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ప్రతి ఇంటినీ అణువణువునా గాలించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ఆనంద్, గాంధీనగర్ ఏసీపీ మొగులయ్యలు మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్థానికులు పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. గాంధీనగర్, దోమలగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలో నివాసం ఉంటూ నేరాపణలు ఎదుర్కొంటున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల వరకు వారు ప్రశాంతంగా ఉండాలని, నిబంధనలు పాటించని యెడల కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సీఐ డి.రాజు, దోమలగూడ డీఐ వరప్రసాద్, ఎస్‌ఐలు నాగరాజురెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హరీష్, నయీమ్‌ఖాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్‌లో పోలీసులకు సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ ఆనంద్



భీమామైదాన్‌లో స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు